హైదరాబాద్ వార్త

ప్రకృతి ఒడిలో పఠనాసంస్కృతి !

నగరంలో పెరుగుతున్న నయా సంస్కృతి

జూబ్లీహిల్స్, మార్చి 22, ప్రభాతవార్త

డిజిటల్ యుగంలో తగ్గుతున్న పఠన సంస్కృతిని మళ్లీ చిగురింపజేస్తూ, ప్రకృతిలో పుస్తకాలతో సేదతీరే కొత్త తరహా సంస్కృతి నగరంలో విస్తరిస్తోంది.జీవితాన్ని మలిచే నిశ్శబ్ద గురువుగా, ఒక మంచి పుస్తకం చేతిలో పడితే, అది పూర్తయ్యే దాకా వదలని మిత్రుడిలా మారుతుంది. చదివే క్రమంలో పాఠకుడు మరో లోకంలోకి వెళ్లిపోతాడు. భావోద్వేగాలు, అనుభవాలు, కొత్త ఆలోచనలు పుస్తకాల ద్వారానే మనసులో నిలుస్తాయి. పఠనం అలవాటు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగకరమని, ఇది సహానుభూతిని పెంచడమే కాకుండా, విశ్లేషణా శక్తిని మెరుగుపరుస్తుందని పలువురు పుస్తకప్రియులు అంటున్నారు. ఒత్తిడిని తగ్గించి, సృజనాత్మకతను పెంచడమే కాకుండా మెదడుకు వ్యాయామంలా పనిచేసే పఠనం, మనసుకు ప్రశాంతతనూ అందిస్తుందంటున్నారు.

ప్రకృతిలో పుస్తకాలతో మమేకం

ఇప్పటి సాంకేతిక యుగంలో మొబైల్ ఫోన్లకు పరిమితమైన చదువు మధ్య, పుస్తకాల వైపు తిరిగి తీసుకెళ్లే వినూత్న ప్రయత్నాలు ప్రారంభమవుతున్నాయి. శనివారం సాయంత్రం అయ్యిందంటే చాలు, నగరంలోని పుస్తకప్రియులు ప్రకృతి ఒడిలో చేరి పఠనంతో సేద తీరుతున్నారు. హైదరాబాద్ రీడర్స్ పేరుతో ప్రతి శనివారం బంజారా హిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవనం పుస్తకప్రియులతో కళకళలాడుతోంది. ఎవరికీ ఎలాంటి ఆహ్వానాలు, గుర్తింపులు అవసరం లేదు. తమకు ఇష్టమైన పుస్తకాన్ని తీసుకుని చెట్ల కింద, రాళ్లపై, లేదా మ్యాట్ వేసుకుని ప్రశాంతంగా చదువుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత.



పుస్తక పఠనానికి వచ్చే హైదరాబాద్ రీడర్స్ సమూహం

బెంగళూరు కుబ్బన్ నుంచి ప్రేరణ...

బెంగళూరులో ప్రారంభమైన కుబ్బన్ రీడర్స్ ఈ సంస్కృతికి ఆద్యంతం. హర్ష్ స్నేహాన్స్, శృతి షా ప్రారంభించిన ఈ చిన్న ఆలోచన ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించి, అంతర్జాతీయ స్థాయికి చేరింది. ఈ కార్యక్రమం దేశ ప్రధాని నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించి ప్రశంసలు పొందింది.

నగరంలోనూ ఇదే తరహాలో..

ఈ స్ఫూర్తితో నగరానికి చెందిన ప్రియాంక పీరంశెట్టి, శ్లోక చంద్రలు హైదరాబాద్ రీడర్స్‌ను ప్రారంభించారు. ప్రతి శనివారం సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు కేబీఆర్ పార్కులో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఇందులో పాల్గొనడానికి ఎలాంటి ఫీజు లేదు, నమోదు అవసరం లేదు. పుస్తక మార్పిడి, చర్చలు లేకుండా నిశ్శబ్దంగా చదవడం ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం క్లబ్ సభ్యుల సంఖ్య మూడంకెలను దాటింది.

పఠనానికి ప్రత్యేకం...

పుస్తకప్రియుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పుస్తకపఠనానికి సంబంధించి సరికొత్త థీమ్‌తో ఇప్పుడు చాలా పుస్తక పఠన కేంద్రాలు నగరంలో కొలువుదీరాయి. జూబ్లీహిల్స్‌లో బుహ్రా సన్స్ బుక్ సెల్లర్స్‌లాంటి వాటితోపాటు ఖైజెన్స్ రీడింగ్ రూం, కొత్తగూడ సమీపంలో ది కఫోర్ట్ పబ్లిక్ లైబ్రరిలతోపాటు సిటీ సెంట్రల్ లైబ్రరీ, వివేకానంద్ ఇనిస్టిట్యూట్ లైబ్రరి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం పుస్తకప్రియులకు మంచి అడ్డాగా మారాయి. దీనికితోడు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్, జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లలో ఇప్పుడు అత్యాధునిక పుస్తకపఠన కేంద్రాలను తీర్చిదిద్దారు.

పఠనంతో మానసిక ఉల్లాసం...

నగర గజిబిజి జీవితంలో కొద్దిసేపు ప్రకృతిలో కూర్చొని పుస్తకం చదవడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఆలోచనలు సానుకూల దిశగా మారుతాయని హైదరాబాద్ రీడర్స్ సభ్యులు చెబుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలో దాహం...దాహం

* పనిచేయని సర్కారు నల్లాలు
* తడిసి మోపెడవుతున్న బిల్లులు
* పర్యవేక్షణ లేని మధ్యాహ్న భోజనం
* చెత్తకుండీ పాలౌతున్న ఆహారం

చాంద్రాయణగుట్ట, మార్చి 22, ప్రభాతవార్త :

విద్యాశాఖ హైదరాబాద్‌జిల్లా పరిధిలోని పలు జోన్లు, మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఆర్వోల నిర్వహణ పట్టీపట్ట నట్లుగా నడుస్తోంది. కొన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులు మాత్రం నిబంధనల మేరకు వ్యవహరిస్తూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం,శుభ్రమైన ఆర్వో తాగునీటిని అందజేస్తున్నారు.అయితే మరికొన్ని పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగా లేనికారణంగా పలుచోట్ల విలువైన మధ్యాహ్న భోజనం చెత్త కుండీ పాలవుతుంది.ముఖ్యంగా తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాలలో ఒక మాధ్యమం పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలను భేఖాతరు చేస్తున్నారు. అసలే ఎండాకాలం తాగునీటి వ్యవస్థ సక్రమంగా లేదు. కొన్ని పాఠశాలల విద్యార్థులు సమీపంలోని దుకాణాల వద్ద క్యాన్లలో ఏర్పాటు చేసిన చల్లటి మంచినీటిని బాటిళ్లలో పట్టుకుంటున్నారు. మరికొందరు ఇంటి నుంచి సురక్షితమైన తాగునీటిని తెచ్చుకుంటున్నారు. పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ప్రైవేటు భవనాలలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉం టుంది.

గత హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలమేరకు పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జలమండలికి మంచి నీటి కనక్షన్ కోసం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంచినీటి కనక్షన్ ఇచ్చారు. అయితే నెలల తరబడిగా చుక్క నీరు రావటంలేదు. బిల్లులు మాత్రం ప్రతినెల టంఛన్‌గా వస్తున్నాయి. బకాయిలు తడిసి మోపెడయ్యాయి. జాతీయ బ్యాంకులు అందించిన వాటర్ ప్లాంట్లు నామమాత్రంగా పనిచేస్తున్నాయి.

సర్కారు నల్లా.. పనిచేయదు మల్లా...

పాతనగర వ్యాప్తంగాగల ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొంది. విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం బబుల్స్, బోరింగ్‌లపై ఆధారపడుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్వచ్ఛమైన మంచినీటిని అందజేసేందుకు ప్రభుత్వం అందించిన నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లకు మంచినీటి వ్యవస్థ సరిగా లేదు. కొన్ని పాఠశాలలు సమీపంలోని వాటర్‌ప్లాంట్ల నుంచి బబుల్స్(వాటర్‌క్యాన్లు) తెచ్చుకొని విద్యార్థులకు తాగునీటిని అందజేస్తున్నారు. మరికొన్ని పాఠశాలలో బోరింగ్ నిటిని ఆర్వోప్లాంట్లలో నింపుతున్నారు. ఆవిధంగా వడపోసిన తాగు నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఉపాధ్యాయులైతే ఇంటినుండి చల్లటి తాగునీటిని, కాచి వడపోసిన నీటిని బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. మరగుదొడ్లు, మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం ప్లేట్లను, పాత్రలను శుభ్రం చేసేందుకు అవసరమైన నీటికి అక్కడక్కడ కటకటపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించటానికి గత హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంచినీటి సమస్యగల పాఠశాలలకు తగిన నిధులను మంజూరు చేశారు. ఆయా పాఠశాలలు తాగునీటి కనక్షన్ తీసుకోవాలని, ఆర్వోప్లాంటును ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆ కలెక్టర్ ఆదేశాలమేరకు అనేక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిబంధనల మేరకు డిడి కట్టి మంచినీటి కనక్షన్ కోసం జలమండలికి దరఖాస్తు చేసుకున్నారు. వాటర్‌వర్క్స్ అధికారులు ఆయా పాఠశాలలకు మంచినీటి కనక్షన్‌ను మంజూరు చేశారు. విచిత్రమేమంటే అప్పటి నుండి చుక్క నీరు రావ టంలేదు. పేరుకు నల్లా కనక్షన్ ఉన్నా మంచి నీళ్ల రాని పరిస్థితి.

కొన్ని పాఠశాలలు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి నల్లా కనక్షన్ ఇచ్చారు. మంచినీళ్ల రాని కారణంగా ఆ పాఠశాల బోరింగ్‌తో అనుసంధానించారు. నల్లా లో నీళ్ల రావటం లేదని జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళితే మోటారు బిగించుకోమని సెలవిస్తున్నారు. అయితే కొన్ని నెలలుగా నీళ్ల రాని నల్లా కనక్షన్లకు బిల్లుల మాత్రం వస్తున్నాయి. ఇప్పటికే అనేక పాఠశాలల బకాయిలు తడిసి మోపెడయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, మంచినీటి కనక్షన్ ఇవ్వాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాల్సి ఉంది.

విద్యాశాఖ బహదూర్‌పురా జోన్ కార్యాలయం, ఇన్‌సెట్లో పనిచేయని ఆర్వో, భోజనం పాత్రలు (ఫైల్)

మధ్యాహ్న భోజనం...చెత్తకుండీలో ఆహారం

పలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహణ పట్టీపట్టనట్లుగా నడుస్తోంది. ప్రతిరోజు విద్యార్థుల సంఖ్యకు తగినంత ఆహార పదార్థాలను తెప్పించుకొని ప్రతిరోజు ఒక ఉపాధ్యాయుడు పర్యవేక్షించాలి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రోజు దగ్గరుండి మధ్యాహ్న భోజనం రుచి చూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించాల్సి ఉంది. అయితే ఇవేవి పట్టించుకోకుండా విద్యార్థులకు వదిలేస్తున్నారు.వారే వడ్డించుకుంటున్నారు. తిన్నంత తిని మిగిలింది చెత్తబుట్టలో వేస్తున్నారు. అన్నం, ఆకుకాయగూరల బిర్యాని, పప్పు, పులిహోర, రోటి పచ్చళ్లు, గుడ్డు ఇలా ఏ ఆహార పదార్థమైన విద్యార్థుల కడుపులోకన్నా చెత్తబుట్టలోకే ఎక్కువగా వెళుతుంది. ఆయాలు చెత్తబుట్టలోని పదార్థాలను మున్సిపల్ చెత్తకుండీలలో వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం రోజుకో మినూ రూపొందించి ఆవిధంగా ఆహార పదార్థాలను సరఫరా చేస్తుంది.రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో అపుడపుడు చోటు చేసుకుంటున్న సంఘటనలతోనైనా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాక్షాత్ రాష్ట్ర రాజధానిలో ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయమై జిల్లా యంత్రంగా పటిష్టమైన చర్యలు తీసుకొని విలువైన మధ్యాహ్న భోజనం వృథా కాకుండా చూడాల్సిన అవసరం ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యార్థులకు అల్పాహారం ఇవ్వనున్నారు. కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయబోతున్నారు. కనీసం ఇప్పటి నుండైన పథకం అమలుపై ఉపాధ్యాయుల చిత్తశుద్ధి, అధికారుల సరియైన పర్యవేక్షణ, నిఘా ఉంటే తప్పా వాటి నిర్వాహణ సైతం అంతంత మాత్రంగానే ఉండే అవకాశం లేకపోలేదు.

రహదారి విస్తరణకు ఆస్తుల స్వాధీనానికి హైకోర్టు స్టే

జూబ్లీహిల్స్, మార్చి 22, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్‌లో రహదారి విస్తరణ ఆస్తుల సేకరణకు హైకోర్టు స్టే ఇచ్చింది. జూబ్లీహిల్స్ రోడ్‌నంబరు 45 నుంచి దుర్గంచెరువు వైపు జీహెచ్ఎంసీ 80 అడుగుల నుంచి 120 అడుగుల రహదారి విస్తరణకు ఆస్తుల స్వాధీన ప్రక్రియను ఇప్పటికే చేపట్టింది. ఇందులో భాగంగా నలుగురు ఇంటి యజమానులు హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ ఎన్.వి.శ్రావణ్‌కుమార్ పిటిషనర్ల ఆస్తుల విషయంలో తదుపరి చర్యలపై స్టే విధిస్తూ, విచారణను ఎప్రిల్ 7కు వాయిదా వేశారు. పిటిషనర్ల అభ్యంతరాలను జీహెచ్ఎంసీ సమగ్రంగా పరిగణలోకి తీసుకోలేదని, కొన్ని వివరాలు అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కాకుండా ఇతర వెబ్‌సైట్‌లలో ప్రచురితమైనట్లు గుర్తించింది. ఆస్తులను ప్రభుత్వ భూములుగా చూపడంపై హైకోర్టు సందేహాలను వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో అనేక ప్రైవేటు ఆస్తులున్నాయని, వాటి యజమానులను స్పష్టంగా పేర్కొన్నప్పటికి సరైన విధానం పాటించలేదని పిటిషనర్లు వారించారు. కాగా సంబంధిత వివరాలతో అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న డాక్టర్ లక్ష్మణ్

క్రీడాకారుల అభ్యున్నతికి కేంద్రం పెద్దపీట

రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్

ముషీరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:

క్రీడాకారులను ప్రోత్సహించటమే కాకుండా వారి అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గాంధీనగర్ ఘంటసాల క్రీడామైదానంలో ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన బ్యాడ్మింటెన్ పోటీ విజేతలకు ఆయన గాంధీనగర్ మాజీ కార్పోరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్‌తో కలసి బహుమతులు, ప్రశంశా పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ కేంద్రప్రభుత్వం అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రీడలలో రాణించి, మన దేశానికి మంచి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.భరత్‌గౌడ్, రమేష్‌రామ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు కే.రాహుల్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు వి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన గంజాయి "దెబ్బ"

బంజారాహిల్స్‌లో పదో తరగతి విద్యార్థి మృతి

నిందితుల్లో ఇద్దరు మైనర్లు, ఇద్దరు యువకులు

మృతిచెందిన రఘువీర్ రాయ్(ఫైల్‌ఫొటో)

జూబ్లీహిల్స్, మార్చి 22, ప్రభాతవార్త : స్నేహితుడిని గంజాయి తాగొద్దని వారించినా వినలేదని తలమీద కొట్టిన ఒక్క దెబ్బతో పదో తరగతి విద్యార్థి మృతిచెందిన సంఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన బంజారాహిల్స్‌లోని గౌరి శంకర్‌నగర్ బస్తీలో నివసించే రఘువీర్‌బాయ్ (19) పదో తరగతి చదువుతున్నాడు. కొద్ది కాలంగా అతను గంజాయికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలోనే అతని స్నేహితుడు(17) పలు మార్లు గంజాయి తాగొద్దని హెచ్చరించాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి బంజారా హిల్స్ రోడ్‌నంబరు 7లోని ఒక పార్కు వద్ద గంజాయి తాగుతూ కనిపించిన రఘువీర్‌తో స్నేహితుడు గొడవపడ్డాడు. రఘువీర్ కొట్టడంతో అతని స్నేహితుడు గట్టిగా రెండు దెబ్బలు తిరిగి ముఖం, తలపై కొట్టాడు. దీంతో రఘువీర్ అక్కడికక్కడే కుప్పకూలాడు. అదే సమయంలో ఫిట్స్ రావడంతో తాళం చెవులు అతని చేతిలో పెట్టినా ఫలితం లేకపోయింది.రఘువీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. దాడిచేసిన సమయంలో నిందితుడితోపాటు మరో మైనరు(16), సాయిసూర్య(19), అక్షయ్ కుమార్(19) ఉన్నారు. వీరిలో సాయిసూర్యపై నాలుగు కేసులు, అక్షయ్ కుమార్‌పై మూడు కేసులు గతంలో నమోదై ఉన్నాయి. నలుగురిని బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్లాబ్ కూలి ఇద్దరు దుర్మరణం

- ఇంటి యజమానికి తీవ్ర గాయాలు

జూబ్లీహిల్స్, మార్చి 22, ప్రభాతవార్త : మూడో అంతస్థులోని ఇంటి బాల్కానీ శ్లాబ్ కూలి ఇద్దరు మృతి చెందగా, ఇంటి యజమాని తీవ్రంగా గాయపడిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. కుందన్‌బాగ్‌లోని మెథడిస్ట్ కాలనీలోని శ్రీవత్స అపార్ట్‌మెంట్‌లోని మూడో అంతస్థులో ఇంటి పనుల నిమిత్తం ఎలక్ట్రీషియన్లు అయిన సీతారాంబాగ్‌కు చెందిన దేవీదాస్(56), అల్లుడు వరుసైన వివేక్(32) వచ్చారు. ఇంటి యజమాని ద్వారకా ప్రసాద్ ఇంట్లో మరమ్మతు పనుల నిమిత్తం వారిని పిలిచారు. ముగ్గురు కలిసి మూడో అంతస్థులోని బాల్కానీలో నిలబడి మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ముగ్గురు మూడో అంతస్థు నుంచి కిందకు పడిపోయారు. ఈ సంఘటనలో దేవీదాస్, వివేక్‌లు అక్కడికక్కడే మృతిచెందగా ఇంటి యజమాని ద్వారకా ప్రసాద్ తీవ్రంగా గాయపడగా వెల్‌నెస్ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

ధ్వంసమైన కారు

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త : ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లారీని కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై అతివేగంగా వచ్చిన కారు ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ధీరజ్ వెంకట సాయి రామ్ (35)అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వెంకట సాయి రామ్ నగరంలోని కర్మాన్‌ఘాట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

కె.సి.పుల్లయ్య ఫౌండేషన్ సేవలు విస్తృతం చేయండి

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

ముషీరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:

కె.సి.పుల్లయ్య ఫౌండేషన్ సేవలు అన్ని ప్రాంతాలకు విస్తరించటం శుభపరిణామమని, ఈ సేవలు మరింత విస్తృతం చేసేందుకు కృషి చేయాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ సూచించారు. ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త కామిశెట్టి అనిల్‌కుమార్ స్థాపించిన కె.సి.పుల్లయ్య ఫౌండేషన్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ మనకు లభించిన సంపదలో ఎంతోకొంత భాగం సమాజానికి ఖర్చు చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. కెసి పుల్లయ్య స్థాపించిన ఫౌండేషన్‌ను నిరంతరం కొనసాగిస్తూ, తండ్రి ఆశయాలను నెరవేరుస్తున్న ఆయన కుమారులను, కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. ట్రస్ట్ ఫౌండర్ కామిశెట్టి అనిల్‌కుమార్ మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ నూతన భవనంలో ఆరు తరగతి గదులు, రెండు ఐటి ల్యాబ్‌లు ఉన్నాయని, ప్రతి సంవత్సరం వెయ్యి మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా రూపొందించామని తెలిపారు. ఈ సెంటర్‌లో 45మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారని, గత 20 సంవత్సరాలుగా ట్రస్ట్ బోర్డును నడిపిస్తున్నామని, ఈ సంవత్సరం 2,560 మంది విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, ఉపాధి అవకాశాలు కల్పించటం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, ఫౌండేషన్ ప్రతినిధులు సుధా, ఫణికుమార్, ట్రస్టీలు పాల్గొన్నారు.

కేసీ పుల్లయ్య ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

మహమూద్‌అలీని కలిసిన తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్

పాతబస్తీ అభివృద్ధికి కృషిచేసిన బిఆర్ఎస్

మాజీ మంత్రి మహమూద్ అలీ

చార్మినార్, మార్చి 22 ప్రభాతవార్త : బిఆర్ఎస్ పాతబస్తీ అభివృద్ధికి కృషి చేసిందని మాజీ మంత్రి మహ్మద్ మహమూద్‌అలీ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీమంత్రి మహమూద్ అలీని వారు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పండుగలను కలిసి మెలిసి జరుపుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్‌పాల్, ప్రతినిధులు సునీల్ అగర్వాల్, బబ్లూ, మానసతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి..!

కిలో స్కిన్‌లెస్ ధర రూ.400

హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త

హైదరాబాద్ మార్కెట్లో కేజీ స్కిన్లెస్ చికెన్ ధర ఏకంగా రూ.400కి చేరుకుంది. ఆదివారం కావడం తో మాంసం ప్రియులు అధిక ధరలు చెల్లించి చికెన్ ముక్క కొనలేక గుటకలు వేస్తున్నారు.ఇటీవలి రోజు ల్లో ధరలు ఆకాశాన్ని తాకుతూ..కొండెక్కిన కోడిలా మారాయి.సాధారణంగా డిమాండ్ తక్కువగా ఉండే అనసీజన్లోనే చికెన్ ధరలు ఒక్కసారిగా పెరగడం వినియోగదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ సీజన్లోలో నమోదైన అత్యధిక ధర ఇదేసని వ్యాపా రులు పేర్కొంటున్నారు. వారం రోజుల్లోనే ధరలు ఏకంగా రూ.80లు పెరిగాయి..నెల రోజుల క్రితం కిలో స్కిన్లెస్ రూ.270 ఉండగా, వారం క్రితం రూ.325 ఉంది. ఇలా క్రమంగా కిలో చికెన్‌పై 30 నుంచి 50 రూపాయల వరకు పెరుగుదల కనిపి స్తుంది దీంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెల కొంది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల ధరలు ఇలా భారీగా పెరిగాయని తెలుస్తోంది. హైదరాబాద్‌లో ధరలు గరిష్ట స్థాయికి చేరినప్పటికీ, గత వారంతో పోలిస్తే ఇతర ప్రాంతాల్లో ధరల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు.వివాహాది శుభకార్యాలు.. వరుస పండుగలు రావడంతో చికెన్‌కి ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్లుగా పౌల్ట్రీ ఉత్పత్తి లేకపోవడంతో సరఫరా

దెబ్బతిని ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. మొత్తం వచ్చేనెలలోనూ చికెన్ రేట్లు కిలో రూ.450 వరకు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. చికెన్ ధర ఎంత అని అడిగి.. కొనకుండా వెళ్లిపోతున్నారని వ్యాపారాలు అంటున్నారు. ఇదే ధరకు హాఫ్ కేజీ మటన్ వస్తదని కదా అంటూ.. కొనకుండా కొనుగోలుదారులు వెళ్లిపోతున్నారట. భవిష్యత్తులో చికెన్ ధరలు మరింత భారంగా మారే అవకాశముందని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

పెళ్లి ఫిక్స్
ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్, మార్చి 22ప్రభాతవార్త : కొన్ని రోజుల్లో పెళ్లి పెట్టుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం నగరంలో కల కలం రేపింది. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూ.. ఎప్పుడూ అదే ధ్యాసలో ఉండే వ్యక్తి చనిపోవడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచేసింది. రాజేంద్రనగర్, శివరాంపల్లిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలాఉన్నాయి. శివరాంపల్లి వికార్ సెక్షన్ కాలనీలో సిద్ధార్థ్(27) స్థానికంగా ఉంటూ చిరు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఉద్యోగం లేకపోవడంతో ఉద్యోగం కోసం ప్రయత్నించినా రాక పోవడంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెళ్లి నిశ్చయమైన కొన్ని రోజుల్లోనే ఇలాంటి దుర్ఘటన జరగడంతో కుటుంబ సభ్యులు దుఃఖసంద్రంలో మునిగిపోయారు. సిద్ధార్థ్ ఎవరితోనూ గొడవలు పెట్టుకునే వ్యక్తి కాదని, ఎప్పుడూ ఉద్యోగం గురించే ఆలోచించేవాడని మృతుడి తమ్ముడు తెలిపారు. ఉద్యోగం రాకపోవడం వల్లే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అత్తాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విబిఎన్ రన్‌ను ప్రారంభిస్తున్న శివకుమార్ ఇమ్మడి, అభిషేక్ చంద

ఉత్సాహంగా విబిఎన్ 5కె రన్

జూబ్లీహిల్స్, మార్చి 22, ప్రభాతవార్త : నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ వద్ద విబిఎన్ 5కె రన్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. వైశ్య బిజినెస్ నెటవర్క్(విబిఎన్) ఆధ్వర్యంలో రన్‌ను నిర్వహించారు. రన్‌లో విబిఎన్ వ్యవ స్థాపకులు శివకుమార్ ఇమ్మడి, అపెక్స్ చైర్మన్ అభిషేక్ చంద పాల్గొన్నారు.

పోర్టర్ డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఉమేష్‌రెడ్డి

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 వేల మంది పోర్టర్ డ్రైవర్ పార్టనర్స్ సమస్యలను పరిష్కారించాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామని ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ హెచ్చరించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు బి.మహేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.ఉమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా తమ 16 డిమాండ్ల సాధనకు ఈ నెల 24, 25 తేదీలో నిరసన దీక్షలు చేపడతామని, 30వ తేదీన 'చలో ట్రాన్స్‌ఫోర్ట్ కమీషనర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికి ప్రభుత్వం పరిష్కారించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 వేల మంది ఏప్రిల్ 6వ తేదీన సమ్మె నిర్వహిస్తారని చెప్పారు. పెరిగిన జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత చార్జీల రేట్లను పెంచాలని, పోర్టర్ యాప్ ద్వారా 5 నుంచి 8 శాతం కమిషన్ వసూలు చేయాలని, అన్యాయంగా విధించే సస్పెన్షన్ల అన్నింటిని నిలిపివేయాలని, జీవిత బీమాను కల్పించలని, ఆర్డర్‌ను రద్దు చేసే హక్కు డ్రైవర్లకే ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ నాయకులు షాజిద్, సయ్యద్ మునీర్, విష్ణు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో స్త్రీ దైవస్వరూపిణి

తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. రమణాచారి


పురస్కారగ్రహీతలతో రమణాచారి, దివ్యవాణి, ఆదిత్య తదితరులు

నాంపల్లి, మార్చి 22 ప్రభాతవార్త : భారతీయ సంస్కృతిలో స్త్రీని దైవ స్వరూపిణి దేవతలా కొలుస్తారన్న తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ప్రముఖ అక్షజ్ఞ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో నేత్రపర్వంగా జరిగిన ఉగాది వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన డా.కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు దివ్యవాణి, వి.ఎన్.ఆదిత్య, ఎస్.పి.భారతి, కృష్ణమోహన్, విద్యావెంకట్, బ్నిం తదితరులతో కలిసి ప్రఖ్యాత నాట్యగురు దీపికారెడ్డి, సిగ్నేచర్ స్టూడియోస్ సీఇఓ అంజలి, రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి, వైదికురాలు అయ్యగారి జయలక్ష్మి, సీనియర్ పాత్రికేయురాలు పురాణపండ వైజయంతి లను ఘనంగా సత్కరించి శ్రీపరాభవనామ సంవత్సర ఉగాది పురస్కా రాలు ప్రదానంచేసి శుభాభినందనలు ఉగాది తెలుగుజాతి సుఖశాంతులు, ఆయుఃఆరోగ్యాలతో వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

విహెచ్‌ను కలిసిని ఎమ్మెల్యే వీరపల్లి శంకర్

విహెచ్‌ను కలిసిన వీరపల్లి శంకర్, శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త : తెలంగాణ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ ఎన్నికైన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ ఆదివారం పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసి తన ఆశీర్వాదం తీసుకున్నారు. ఓబిసి చైర్మన్‌గా శనివారం సోమవారం బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా అంబర్‌పేటలోని విహెచ్ నివాసానికి చేరుకొని ఆయన్ను కలుసుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్‌ను విహెచ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబిసి కన్వీనర్లు డాక్టర్ కేతూరి వెంకటేష్. డాక్టర్ జూలూరి ధనలక్ష్మి టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య

అత్తాపూర్, మార్చి 22, ప్రభాతవార్త : పరిసరాలను శుభ్రంగా ఉంచుకు న్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అత్తా పూర్ సర్కిల్ పరిధిలో స్వచ్ఛ సండే – సరస్సు శుభ్రత కార్యక్రమాన్ని సాయిబాబా నగర్‌లోని మార్సాబాయి కుంట సరస్సు నుండి కాటేదాన్ మెయిన్‌రోడ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, శానిటేషన్ ఆటో టిప్పర్ వాహనాలకు అప్పగించాలని సూచించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ నిర్మూలనకు ప్రజల సహకారం అత్యంత అవసరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ తిరుపతి, ఏఈఈ ఆశిష్, శానిటేషన్ సిబ్బంది, ఎంటమాలజ విభాగం సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార వేదిక...

అత్తాపూర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం వేదిక డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందు లో ప్రజల నుంచి వచ్చిన ప్రాపర్టీ ట్యాక్స్ సంబంధిత ఫిర్యాదులను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీలు, అధికారులు, సిబ్బంది ఉన్నారు

స్వచ్ఛతపై అవగాహన కనిపిస్తున్న డిసి సమ్మయ్య, తదితరులు

బిసిలకు బడ్జెట్‌లో అన్యాయం

తెలంగాణ బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి చిరంజీవులు

అభివాదంచేస్తున్న బిసినేతలు చిరంజీవులు, బాలరాజ్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు బడ్జెట్‌లో తీరని అన్యాయం చేసిందని, తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బిసిలను చైతన్యవంతం చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బడ్జెట్‌లో 'బిసి లకు–తీవ్ర అన్యాయం'పై జరిగినసదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న మాదిరిగానే బిసిలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని, ఈ బడ్జెట్ లో ఇప్పటికైనా బిసిలకు 50 వేల కోట్లు కేటాయిం చాలని, బిసి కార్పోరేషన్‌కు, బిసి కులాల ఫెడరేషన్ లకు నిధులు విడుదల చేయాలని, బిసి విద్యార్థు లకు మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత బిఆర్‌ఎస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌ల్లో చాలా తక్కువగా నిధులు కేటయించి, ఆ కేటాయించిన నిధుల్లోనూ పూర్తిగా ఖర్చు చేయకుండా బిసిలకు తీరని ద్రోహం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్ర జనాభాలో సగానికిపైగా బిసిలు ఉన్నారని, వారు అన్నిరకాల పన్నులు ప్రభుత్వానికి చెల్లి స్తుంటే, అభివృద్ధిలో మాత్రం ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని ఆయన ఆరోపించారు. బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ కామారెడి డిక్లరేషన్‌లో ప్రతి ఏడాది 20 వేలు కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తా మని హామీ ఇచ్చి బడ్జెట్‌లో అతి తక్కువగా నిధులు కేటాయించిందని ఆరోపించారు. బిసిలంటే ప్రభు త్వానికి చిన్నచూపుగా చూస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా బడ్జెట్‌లో బిసిలకు ఇచ్చిన హామీ ప్రకా రం తగినన్ని నిధులు కేటాయించాలని, లేని పక్షం లో తగిన గుణపాఠం చెపుతామని ఆయన హెచ్చ రించారు. ఈ సదస్సుకు ఎస్.దుర్గయ్యగౌడ్ అధ్య క్షత వహించగా, బిసినేతలు ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, బైరీ శేఖర్, అంబాల నారాయణగౌడ్, వెంకన్న నేత, శ్రీకాంత్, కైలాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, బస్తి పెద్దలు

హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

అత్తాపూర్ మార్చి 22,ప్రభాతవార్త: ఏప్రిల్ 5 ఆదివారం సాయంత్రం జరిగే హిందూ సమ్మేళనంను జయప్రదం చేయాలని పలువురు పేర్కొన్నారు. నాలుగు బస్తిలు బుద్వేల్ రైల్వే స్టేషన్, నేతాజీ నగర్ శ్రీరామ్ నగర్, వెంకటేశ్వర కాలనీల ప్రజలు హిందూ సమ్మేళనం కమిటీ వేసుకున్నారు. అధ్యక్షులుగా విశ్రాంత ఉద్యోగి ఎద్దుల ప్రభాకర్ రెడ్డి ని ఎన్నుకున్నారు. వెంకటేశ్వర కాలనీ బొడ్రాయి చౌరస్తాలో హిందూ సమ్మేళనం కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. హిందువులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మన ఐక్యతను చాటి సభను విజయవంతం చేయాలనీ కోరారు. సుమారు 3 వేల మందితో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు కమిటీ సభ్యులుగా... సురేష్, గణేష్, చిరంజీవి, నారాయణ, మహేష్‌గౌడ్, దత్తు జైపాల్, బాలకృష్ణరెడ్డి, రామారావు, సలహా దారులుగా సుధాకర్‌గౌడ్, మాధవరెడ్డి, రాజు, జగన్, స్వామిగౌడ్, డాక్టర్ కృష్ణ, మురళీకృష్ణగౌడ్, అనంతరెడ్డి వ్యవహరిస్తారని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

రెజిమెంటల్ బజార్‌లో ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, మార్చి 22 ప్రభాతవార్త: మురికివాడల్లో నివాసం ఉంటున్న పేదలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముం దుకు రావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత సి.బద్రినాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆది వారం రెజిమెంటల్ బజార్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, బాబురావ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకమైన వారిని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం

- సినీ నటుడు సత్యదేవ్

జూబ్లీహిల్స్, మార్చి 22, ప్రభాతవార్త : నమ్మకమైనవారిని గుర్తించి పని చేయించుకోవడం ఎంతో ముఖ్యమని సినీనటుడు సత్యదేవ్ అన్నారు. నూత నంగా ఏర్పాటు చేసిన అర్బన్ క్లీన్ ప్లాట్‌ఫామ్‌తోపాటు మొబైల్ యాప్‌ను శని వారం ఆయన ప్రారంభించారు. సత్యదేవ్ మాట్లాడుతూ అభివృద్ధి చెందు తున్న హైదరాబాద్‌లాంటి నగరంలో తొలిసారిగా ఇన్ కమ్యూనిటీ సేవక్ అనే కాన్సెప్ట్ తీసుకురావడం అభినందనీయమని అన్నారు. అర్బన్ క్లీన్ ఫౌండర్ సీఈవో వాడపల్లి రామకృష్ణ మాట్లాడుతూ తాము ఇప్పటికే ఇన్ కమ్యూనిటీ సర్వీసెస్ ద్వారా 11 వేల మందికి సేవలు అందించామని తొలి దశలో 32 వేల మందికి సర్వీసెస్ అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ వద్ద ఉండే సిబ్బంది ఇంట్లోని అన్ని విభాగాలకు సంబంధించిన టెక్నీషియన్లు ఉంటారని వినియోగదారుల భద్రతతో పాటు పని చేసేవారిని కూడా అన్ని రకాలుగా పరీక్షించి, పూర్తి వివరాలు, ధృవీకరణపత్రాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వారికి 15 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. గేటెడ్ కమ్యూనిటీలలో ఈ తరహా సేవలపై ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు పూర్తి చేశామని త్వరలోనే మరింత విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఫౌండర్, సీటీవో అరవింద్, వరుణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

26న 'నా అడుగులటువైపే' కవితా సంపుటి ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట, మార్చి 22, ప్రభాతవార్త: తెలంగాణా భాషా సాంస్కృ తిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమి, సమ్మక్క సారక్క డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ పాతనగర కవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ గురువారం సాయంత్రం 5గంటలకు 'నా అడుగులటువైపే' అన్న కవితా సంపుటి ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కొరుప్రోలు హరనాథ్ తెలిపారు. రవీంద్రభారతి సమావేశ మందిరం మొదటి అంతస్థులో డాక్టర్ కొరుప్రోలు హరనాథ్ 'నా అడుగులటువైపే' కవితాసంపుటిని ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరిస్తారని, డాక్టర్ కాంచనపల్లి అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. కార్య క్రమంలో ప్రముఖ కవయిత్రి ధూళిపాళ అరుణ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ కవయిత్రి డాక్టర్ దేవుల పల్లి వాణీదేవి, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ బాలాచార్య నమోజు, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి హాజరౌతారని పేర్కొన్నారు. అనంతరం పరాభవ నామ సంవత్సరం యుగాది, శ్రీ రామనవమి సందర్భంగా పర్యావరణ, ప్రకృతి, వసంతం, దాంపత్యం అనే అంశాలపై కవి సమ్మేళనం ఉంటుందన్నారు.

పేదల పక్షాన పోరాడతాం

భారతీయ జవాన్ కిసాన్ పార్టీ

చిక్కడపల్లి మార్చి 22 (ప్రభాతవార్త) : దేశంలోని వివిధ రాష్ట్రాలలో పేద వర్గాలను మరింత పేదరికం లోకి నెట్టకుండా, వారికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆసరాగా నిలిచేలా ఒత్తిడి తెస్తామని భారతీయ జవాన్ కిసాన్‌పార్టీ స్పష్టం చేసింది. ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ జాతీయ స్థాయి కీలక సమావేశం పార్టీ తెలం గాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గండి సురేంద్రనాథ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైద్యనాథ్‌ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాగ్ బీర్‌సింగ్ జర్‌జర్, కోఆర్డినేటర్ ఎస్.మోహన్ రావు, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కోయింబత్తూర్, బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుల్వంత్‌సింగ్, గోవింద్‌రాజ్, విఘ్నేష్, కె.రాజేశ్వర్, గండి సురేందర్‌నాథ్, విజయదర్శిని రాష్ట్ర అధ్య క్షుడు బి.ఆదంరాజు, పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీత, కోశాధికారి కల్పన, సభ్యులు లాల్‌దాస్, సత్యప్రసాద్ రావు, సిద్దిపేట జిల్లా అధ్య క్షుడు జి.హనుమంతరావు, జమ్మికుంట విభాగం సభ్యుడు ఏ.రమేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అన్ని రాష్ట్రాల అధ్యక్షులతో జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసు కున్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీ, క్రిస్టియన్ వర్గాలకు న్యాయం జరిగేలా పోరా టాలు సాగించాలని నిర్ణయించారు. ఆయా రాష్ట్రాల సంపద కేవలం కొందరికే పరిమితం కాకుండా అన్ని వర్గాలకు సమానంగా అందాలని డిమాండ్ చేశారు. నీతి, నిజాయితీతో కూడిన రాజకీయాలే తమ లక్ష్యమని, ప్రజల పక్షాన ఉండి సమస్యలపై గళం విప్పుతామని నేతలు ప్రకటించారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేకూరే వరకు పార్టీ విశ్రమించ బోదని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రభు త్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల పేదవాడు మరింత పేదరికంలోకి కూరుకుపో తున్నాడు. వారికి అండగా ఉండి, ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే మా బాధ్యత అని స్పష్టం సమావేశం అభిప్రాయపడింది.

సమావేశంలో భారతీయ జవాన్ కిసాన్ పార్టీ వివిధ రాష్ట్రాల అధ్యక్షులు

వైభవంగా 'మా భగవతి విశాల్ జాగరణ్'

పాల్గొన్న సీనియర్ ఐపిఎస్ అధికారులు శిఖా గోయల్, విజయ్‌కుమార్

'మా భగవతి విశాల్ జాగరణ్' ప్రారంభిస్తున్న ఐపీఎస్ అధికారులు శిఖా గోయల్, విజయ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త

మా భగవతి విశాల్ జాగరణ్ ఒక శక్తివంతమైన ఆధ్యాత్మిక సాధనం అని, ఇది భక్తులు దివ్యమాత తో అనుసంధానం కావడానికి, ఆధ్యాత్మిక ఎదుగుద లను పొందడానికి సహాయపడుతుందని తెలంగాణ డిజిపి, డైరెక్టర్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శిఖా గోయల్ అన్నారు. దేవత పట్ల భక్తిని మరియు కృతజ్ఞతను వ్యక్తపరచడానికి, శాంతియుత, సంపన్న మైన జీవితం కోసం ఆమె ఆశీర్వాదం కోరడానికి ఒక మార్గమన్నారు. సనాతన సంప్రదాయాల పరి రక్షణలో భాగంగా, దైవిక రక్షణ, కుటుంబాల ఆశీ ర్వాదం కోసం ప్రేమ, కరుణ, భక్తి, ధర్మం వంటి విలువలను పెంపొందించేందుకు నాంపల్లి, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు మా వైష్ణోదేవి మాతా జాగరణ్ మండల్ సంస్థ "మా భగవతి విశాల్ జాగరణ్"ను అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శిఖా గోయల్, రాష్ట్ర ఇంటిలెజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శిఖా గోయల్ మాట్లా డుతూ జాగరణ్ ప్రశాంతమైన వాతావరణాన్ని సృష్టించి, మనస్సును, ఆత్మను శుద్ధి చేస్తుందని అన్నారు. మా వైష్ణోదేవి మాతా జాగరణ్ మండల్ హైదరాబాద్ కోర్ కమిటీ సభ్యులు రామ్‌కిషన్ అగ ర్వాల్, అంజనీ కుమార్ అగర్వాల్, రాకేష్ నర్సింగ్ పురియా, సంజయ్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, పురుషోత్తం అగర్వాల్, ముఖేష్ అగర్వాల్, రాకేష్ జలాన్, సూర్యకమల్ జి పుత్రా, అంజనీకుమార్ సరోగి నేతృత్వంలో జరిగిన ఈ "మా భగవతి విశాల్ జాగరణ్"ను జమ్మూ కాట్రా లోని మాత వైష్ణవదేవి మందిర్ పూజారి లోకేష్ జి మహారాజ్ ప్రత్యేక పూజలు జరిపి ప్రారంభించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని తల్లి భగవతి ఆస్థా నంలో అఖండజ్యోతి, మహాసభ, అతీంద్రియ దర్శ నం, భజన గంగా, మాత నిధి, తారా రాణి కథ, ఆర్తి, మహా ప్రసాదం, ఖజానా వంటివి స్వీకరిం చారు. జోధ్‌పూర్ కు చెందిన ప్రముఖ జాతీయవాద గాయకుడు ఛోటూసింగ్ రావ్నా న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ భజన గాయకుడు సుమిత్ సైని, హైదరా బాద్‌కు చెందిన గాయకుడూ భజన సామ్రాట్ మురారి దహిమా ఉత్సాహభరితమైన భక్తి వాతావరణంలో మాతా భగవతిని స్తుతిస్తూ పాడిన భజనలు, కీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక అనుభూతిలో ముంచే త్తాయి. కార్యక్రమంలో జాంబాగ్ మాజీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, రాజస్థాన్ ప్రగతి సమాజ్ ప్రధాన కార్యదర్శి గోవింద్ నారాయణ్ రాతి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు కరోడీమల్ నర్సింగపురియా తదితరులు పాల్గొన్నారు.

25న జర్నలిస్టుల 'చలో హైదరాబాద్'

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్షధోరణికి వ్యతిరేకంగా ఈ నెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులు 'చలో హైదరాబాద్–ఐ అండ్ పిఆర్ కార్యా లయం' పేరిట ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీ నర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తరువాత గత రెండేళ్ళుగా జర్నలిస్టులను పూర్తిగా విస్మరిం చిందని ఆరోపించారు. జర్నలిస్టుల పట్ల పూర్తిగా వివక్ష చూపుతుందని చెప్పడానికి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమన్నారు. బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం ఊసేలేకపోవడం, కనీసం ఒక్కమాట మాట్లాడక పోవడం దారుణమన్నారు. 25న జరిగే ఆందోళనలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జర్నలిస్టులు ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలి:వేణు పిలుపు

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: నేటి ప్రపంచీకరణ, కంప్యూటర్ యుగంలో జర్నలిస్టులు ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ కొత్త స్కిల్స్ అభ్యసిస్తూ ఉండాలని ప్రముఖ వెబ్‌సైట్ ది వైర్ వ్యవస్థాపక ఎడిటర్ ఎం.కె.వేణు సూచించారు. ఈ నెల 27, 29 తేదీలలో విజయవాడలో జరగనున్న ఐజేయూ జాతీయ ప్లీనరీని పురస్కరించుకుని ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే, మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'సోషల్ మీడియా ప్రభావం–మంచీ చెడు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. వేణు మాట్లాడుతూ ఒకప్పుడు ఇంటింటికి తిరిగి న్యూస్ పేపర్లు పంపిణీ చేసేవారని, నేడు సోషల్ మీడియాలో ఒక జర్నలిస్ట్ ఒకచోట కుర్చుని చేసిన స్టోరీ క్షణాల్లో ప్రపంచం మొత్తం వెళుతున్నదన్నారు. నేడు ట్విట్టర్, పేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, యూ ట్యూబ్ లాంటివి డిస్ట్రిబ్యూటర్స్‌గా ఉన్నాయన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా వార్ సమాచారం సోషల్ మీడియాలోనే ఎక్కువగా వస్తున్నదని, ట్విట్టర్‌లాంటి వాటిని ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. ఈ సదస్సు కు సీనియర్ జర్నలిస్టు సోమశేఖర్ అధ్యక్షత వహించగా, మెఫీ మేనేజింగ్ ట్రస్టీ, ఐజెయు మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్‌ఆలీ, కే.రామ్‌నారాయణ, ఐజేయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, సభ్యుడు ఎం.ఎ.మాజీద్ పాల్గొన్నారు.

బాలకళాకారులకు రసమయి ఉగాది పురస్కారాలు

జవహర్ బాలభవన్ పూర్వ డైరెక్టర్ డా. రాము

రవీంద్రభారతి, మార్చి 22 ప్రభాతవార్త : ప్రముఖసంస్థ రసమయి ప్రతీ ఏటా బాలకళాకారులను ప్రోత్సహిస్తూ అందిస్తున్న పురస్కారాల్లో భాగంగా రసమయి ఉగాది పురస్కారాలకు అర్హులైన బాల కళాకారుల నుండి దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, జవహర్ బాల భవన్ పూర్వ డైరెక్టర్ డా. ఎం.కె.రాము ప్రకటించారు. లలితకళల్లో ప్రతి భావంతులైన బాల కళాకారులు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, సాహి త్యం తదితర వివిధరంగాలలో ప్రతిభావంతులు రసమయి మొబైల్ నంబరు 9848014793లో ఈ రోల 27వ తేదీల్లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. డా. ఎం.కె.రాము అధ్యక్షతన ఈ నెల 30వ తేదీ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ఎంపికైన బాల కళాకారులకు బహుమతులు, ఉగాది పురస్కారాలు ప్రదానం చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఠాను నాయక్‌కు ఘన నివాళులు


ఠాను నాయక్‌కు నివాళులర్పించిన బంజారా నాయకులు

సరూర్‌నగర్, మార్చి 22 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసి పరిధిలోని జిల్లెల గూడ చందన చెరువు కట్టపై లంబాడాల కొడమ సింహ జాతోతు ఠాను నాయక్ 77వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బంజారా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన పలువురు ముఖ్యులు ఠానునాయక్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఠాను నాయక్ పోరాట స్ఫూర్తిని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ ఇంద్రావత్ రవినాయక్, నాయకులు రవి నాయక్, శంకర్ నాయక్, హాము నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.

29న పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

యూసుఫ్‌గూడ, మార్చి 22, ప్రభాతవార్త : గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నిక ఈ నెల 29న నిర్వహించనున్నారు. ఇందుకుగాను నామినేషన్‌లను ఆదివారం నిర్వహిం చారు. అధ్యక్షుని పోటీలో సుంకన్న అనుచరులతో కలిసి ర్యాలీగా తరలి వెళ్లి పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికల అధికారి సురేందర్‌గౌడ్‌కు అందజేశారు. అదివిధంగా మరో అభ్యర్థి మొగలిరాజు అనుచరులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేశారు. రెండురోజులపాటు ఈ నెల 22 ఆదివారం 23 సోమవారం నామినేషన్‌లు నిర్వహిస్తున్నారు. విత్‌డ్రాలను 23వ తేది సాయంత్రం 5గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించడంతోపాటు గుర్తుల కేటాయింపు ఓటర్ల లిస్టును ఫైనల్‌గా నిర్ణయించనున్నారు. 24వ తేది నుంచి 28వ తేది సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల ప్రచారం ఉంటుందని 29వ తేది ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు ఎన్నికలను నిర్వహించు కునేం దుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

గాయత్రినగర్ కాలనీ అధ్యక్షుడిగా శ్రీనివాస్


అధ్యక్షుడు మునిగలగాని శ్రీనివాస్, కోశాధికారి ప్రభాకర్ బాధ్యతల స్వీకారంలో పాల్గొన్న కాలనీవాసులు

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త : బోడుప్పల్, గాయత్రినగర్ ఫేస్–1 కాలనీకి నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన ముగలగాని శ్రీనివాస్, ట్రెజరర్‌గా ఎన్నికైన ప్రభాకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్, ప్రభాకర్‌లు మాట్లాడుతూ గాయత్రినగర్‌కాలనీ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని, శుభ్రత, భద్రత, సౌకర్యాల పరిరక్షణలో కొత్త మార్పులు తీసుకురావడానికి పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, సమర్థవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీ అభ్యున్నతికి అందరి సహకారంతో కలిసికట్టుగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి సీనియర్ బిఆర్‌ఎస్ నాయకుడు దూసరి వెంకట్‌గౌడ్ శుభాకాంక్షలు అందజేశారు.

మెథడిస్ట్ చర్చి భూముల అమ్మకం వదంతులే

చిక్కడపల్లి, మార్చి 22 (ప్రభాతవార్త): మెథడిస్ట్ చర్చి ఇన్ ఇండియా, హైదరాబాద్ ప్రాంతీయ కాన్ఫరెన్స్ పరిధిలోని భూములు లేదా ఆస్తులను అమ్మడం కానీ, లీజుకు ఇవ్వడం కానీ జరగలేదని ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ ఎ.స్టీవెన్ స్పష్టం చేశారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. జహీరాబాద్‌లోని ఎంఆర్హెచ్‌ఎస్ గార్డెన్‌నగర్ ప్రాంత భూములకుసంబంధించి వస్తున్న వార్తలు అవాస్తవాలని, నిరాధారమైన ప్రచారాలు అని ఖండించారు. చర్చి కేవలం ఈ ఆస్తులకు కస్టోడియన్‌గా ఉంటుందని, సమాజ ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. కొందరు వ్యక్తులు స్వప్రయో జనాల కోసం చర్చి ప్రతిష్టను దెబ్బతీసేందుకు తప్పుడు వదంతులు వ్యాప్తి చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈనెల 15న జహీరా బాద్‌లో హెచ్ఆర్సీ పాస్టర్లపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండిం చారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధికారులు, సంఘ ప్రముఖులు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

కంటోన్మెంట్,మార్చి 22 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. లక్షలాది రూపాయల వ్యయంతో ఆదివారం 8వ వార్డు బొల్లాం,7వ వార్డు గన్‌రాక్,టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌వెల్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెచ్చినట్లైతే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఓపెన్ జిమ్, పవర్ బోర్‌వెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలను రాష్ట్ర మున్సిపల్ కార్పోరేషన్‌లో విలీనం చేసేందుకు ప్రజల సహకారం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, రంగ రవిందర్‌గుప్త, కాలనీ ప్రతినిధులు నవీన్, ప్రభు, అశోక్, గోఖుల్ పాల్గొన్నారు.

పూల్‌బాగ్‌లో ఎఫ్ఎస్ఎస్ఎఐ మేళా

పూల్‌బాగ్‌లో ఎఫ్ఎస్ఎస్ఎఐ మేళాను ప్రారంభిస్తున్న డీసీ సురేందర్

చాంద్రాయణగుట్ట, మార్చి 22, ప్రభాతవార్త : 'ప్రజా పాలన పట్టణ ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా పూల్‌బాగ్ వద్ద ఏర్పాటు చేసిన చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, ఫలక్‌నుమా సర్కిళ్ల ఆహార భద్రత నమోదు మేళాను(ఎఫ్ఎస్ఎస్ఎఐ) డిప్యూటీ కమిషనర్లు వి.సురేందర్, ఎ.నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేళా ద్వారా ఆహార భద్రత ప్రమాణాలపై వ్యాపారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. 69 మందికి ఉచితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేళాలో చిన్నస్థాయి ఆహార పదార్ధముల తయారీ, అమ్మకందారులు పాల్గొని తమ వ్యాపారాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యుసిడి పిఓలు వై.కరుణాకర్, దైవానిధి, సీఓలు రాములు, వి.సునీత, మాధురి, పి.సునిత, ఆర్పీలు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

కంటోన్మెంట్, మార్చి 22 ప్రభాతావార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ తెలిపారు. ఎస్సీ ఎస్టీ సంక్షేమ బడ్జెట్ లో 75 శాతం నిధులు తగ్గించడం,బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్టు 20 వేల కోట్ల బడ్జెట్ ప్రకటించకపోవడం, మైనారిటీలకు డిక్లరేషన్‌లో 4వేల కోట్ల హామీ ఇచ్చి మోసం చేయడం, ఇప్పటివరకు ఒక్క యువకుడికి ఇవ్వకపోయినా కేవలం ప్రకటనలకే పరిమితం అయిన రాజీవ యువ వికాసం, భట్టి బడ్జెట్ బోగస్ బడ్జెట్ అని కంటోన్మెంట్‌లో నిరసన కార్యక్రమాన్ని చెపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ది చెబుతారని అన్నారు. అనంతరం సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో యాసిన్, ఆనంద్, గంగారాం, చంద్రశేఖర్, మోని, రఘు, సాయి, రాజు వెంకట్ పాల్గొన్నారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

ఉప్పల్, మార్చి 22 ప్రభాతవార్త: ఉప్పల్ మినీ శిల్పారామంలో మూడు రోజుల సురభి డ్రామా ఫెస్టివల్ ముగింపు సందర్భంగా సురభి డ్రామా దియేటర్, సురభి జయానంద్ ఆధ్వర్యంలో ఆదివారం మాయబజార్ నాటకం ప్రదర్శించారు. శశిరేఖా పరిణయం, అభిమన్యుడు, శశిరేఖల ప్రేమ, కృష్ణుడి మాయోపాయంతో ఘటోత్కచుడు వారి వివాహం జరిపించడం, కౌరవుల కుట్రలను తిప్పికొట్టడం ఇందులో ప్రధానాంశం. హాస్యం, అద్భుత రసాలతో సాగిన నాటకం ఆహుతులను అలరించింది. రాధా సౌగంధి శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఆదివారం సెలవు కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.

బడ్జెట్ అంకెల గారడీ

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, మార్చి 22 (ప్రభాతవార్త) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీ అని, సామాన్య ప్రజలకు ఇందులో దక్కింది ఏమీ లేదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. ఆదివారం గాంధీనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్, రాంనగర్, కవాడిగూడ, బోలక్‌పూర్, ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్ల అధ్యక్షులు రాకేశ్ కుమార్, శంకర్ ముదిరాజ్, శ్యామ్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, మన్నే దామోదర్ రెడ్డి, మాదవ్, దిద్దియాల్ రెడ్డి, ఆరుణ్, మారస్వామి, సాయి, శ్రీకాంత్,మహ్మద్‌ఆలీతో కలిసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేవని కేటీఆర్ ధ్వజమెత్తారు. "రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు నెలకు రూ.2500 వంటి కీలక పథకాలకు నిధులు ఎక్కడ నుంచి తెస్తారో స్పష్టత లేదు. ఇది కేవలం కాగితాలకే పరిమితమైన బడ్జెట్" అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఐటీ రంగం, పరిశ్రమల విస్తరణకు అవసరమైన ప్రోత్సాహకాలు బడ్జెట్‌లో కనిపించడం లేదన్నారు. "విశ్వనగరంగా వెలుగుతున్న హైదరాబాద్ ప్రతిష్టను ఈ బడ్జెట్ దెబ్బతీసేలా ఉంది. కొత్త ప్రాజెక్టులు లేకపోగా, ఉన్న వాటికి నిధుల కోత విధించడం దురదృష్టకరం" అని పేర్కొన్నారు. పద్దుల్లో చూపిన అంకెలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని ఆయన విమర్శించారు. ఈ బడ్జెట్ వల్ల యువతకు, నిరుద్యోగులకు ఎలాంటి ఆశాజనకమైన వార్తలు లేవని, ఇది కేవలం కాలయాపన చేసే బడ్జెట్ అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అంకెలతో మభ్యపెడుతోందని ఆయన మండిపడ్డారు.



మాట్లాడుతున్న ముఠా గోపాల్

గ్రేటర్‌లో విలీనమైనా కాలనీల్లో అభివృద్ధి శూన్యం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 22 ప్రభాతవార్త: హైదరాబాద్ శివార్లలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జిహెచ్ఎంసిలో విలీనం చేసిన ప్రభుత్వం స్థానిక ప్రజలకు సదుపాయాలను కల్పించడంలో విఫలమవుతున్నదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. విలీనం కాలనీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయనీ దోమల బెడద, పారిశుధ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన నాదర్‌గుల్ డివిజన్‌లోని అల్మాస్‌గూడ మధురాపూరి కాలనీ ఫేజ్-3లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సొంతంగా నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌ను అదే విధంగా శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో స్థానిక రెసిడెంట్స్ అసోసియేషన్ వారు స్వంతంగా నిర్మించిన ఎస్ఎస్‌హెచ్ (శ్రీశ్రీ హోమ్స్) స్విమ్మింగ్ పూల్‌ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిహెచ్ఎంసిలో విలీనమైన కాలనీలకు సౌకర్యాల కల్పన జరగడం లేదని అన్నారు. అదే విధంగా ప్రజలు దోమలు, చెత్తా చెదారం సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ప్రభుత్వం ప్రజల కనీస ప్రాథమిక సమస్యలను కూడా పరిష్కరించలేని స్థితిలో ఉందని ఆమె విమర్శించారు. దోమలు విపరీతంగా ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చూడా చేయడం లేదని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని ఆమె అన్నారు. మంత్రులు వేసి శిలాఫలకాలు శిలా ఫలకాలుగానే ఉన్నాయే తప్ప అభివృద్ధి పనులు జరగడం లేదని ఆమె ఆరోపించారు. కెసిఆర్ సిఎంగా ఉన్న సమయంలో మంజూరైన అభివృద్ధి పనులను అడ్డుకున్నారనీ టెండర్లను రద్దు చేయడం ద్వారా అభివృద్ధి పనులు నిలిచాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ సర్కిల్-1 బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, నాయకులు తూఫాన్‌రెడ్డి, గాయత్రీ, గీత తదితరులతో పాటు కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యవర్గం వారు, కాలనీలవాసులు, మహిళలు పాల్గొన్నారు.

అరవింద్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న మారిశెట్టి నర్సింగరావు

రేవంత్ సర్కార్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: రాష్ట్రంలో అధికారంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవిత్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆర్టీసి క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు ఆధ్వర్యంలో అరవింద్‌కుమార్‌యాదవ్‌కు ఘనంగా సత్కరించే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, అభిషేక్ కెన్నడీ, బాబ్జి, గుండు జగదీష్, గొనె సల్మాన్ రాజ్, నరేందర్ యాదవ్, సాయిరాం, యాదగిరి, శ్రీనివాస్, సమీర్, భాస్కర్, డి హెచ్ మధుమతి, పుస్తకాల కవిత, సుబ్బన్న, అభిషేక్ కెన్నడీ, హాఫీజ్, సంపత్, భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లు, మహిళలపై దాడులు అమానుషం

గొనె సల్మాన్‌రాజ్

చిక్కడపల్లి, మార్చి 22 (ప్రభాతవార్త) : జహీరాబాద్ ప్రాంతంలో క్రైస్తవ మత పెద్దలు, మహిళలపై జరిగిన అమానుష దాడులను తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు బి. ప్రేమ్‌సాగర్, థామ్సన్, అజ్రియా మోసెస్, జోసెఫ్, పాల్ బంటీ, జయపాల్, ప్రశాంత్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గోనే సోలమన్‌రాజ్ మాట్లాడుతూ, మార్చి 15న జహీరాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెథడిస్ట్ చర్చి సమీపంలో పాస్టర్లపై స్థానిక రౌడీలు దాడికి పాల్పడ్డారని తెలిపారు. అదే రోజు రాత్రి అద్వైత జోషి ధాబా సమీపంలో మహిళలను హైవేపై తరిమి, వారిని దూషించిన ఘటనలు అత్యంత దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. బాధితులకు అండగా ఉండాల్సిన జహీరాబాద్ పోలీసులు తన విధుల్లో విఫలమవ్వడమే కాకుండా వృత్తిపరమైన దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని ఆరోపించారు. గాయపడిన పాస్టర్లను రక్షించాల్సింది పోయి, వారిపైనే అక్రమంగా ఎదురు కేసులు నమోదు చేసి నేరస్తులను కాపాడే ప్రయత్నం చేశారని వారు మండిపడ్డారు. అయితే, పాస్టర్ శ్రీనివాస్ హెర్బర్ట్ ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్ల సమయస్ఫూర్తిని ఈ సందర్భంగా వారు అభినందించారు. మహిళలకు రక్షణ, సమ్మిళిత తెలంగాణను నిర్మించాలన్న సీఎం ఆశయాలకు ఇటువంటి ఘటనలు విరుద్ధం అని, మతపరమైన హింసపై కఠిన చర్యలు తీసుకోకపోతే అది ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది అని రాష్ట్ర మహిళా ఇన్‌చార్జ్ సి.హేమలత, యువజన ఇన్‌చార్జ్ ఎం.శాలిని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి, విధుల్లో నిరక్ష ్యం వహించి, తప్పుడు కేసులు నమోదు చేసిన ఎస్సై వినయ్ కుమార్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. తెలంగాణ డీజీపీ, సంగారెడ్డి ఎస్పీ ఈ విషయంలో జోక్యం చేసుకుని ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించాలి.

జ్యోతిని వెలిగిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పక్కన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌కు పురస్కారాన్ని అందిస్తున్న రమణాచారి

వంశీ ఉగాది పురస్కారాలు అపురూపం

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

చిక్కడపల్లి, మార్చి 22 (ప్రభాతవార్త) : ఏక కాలం ఒకే వేదికపై పన్నెండు గంటలు నిర్విరామ విభిన్న కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసి విదేశాంధ్రులతో పాటు దేశంలో ప్రతిభావంతులైన తెలుగువారిని సత్కరించటం వంశీ చేస్తున్న అపురూప కార్యక్రమం న భూతో న భవిష్యత్ అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సాంస్కృతిక కళాసారధి, సింగపూర్ సీల్ వెల్ కార్పొరేషన్ నిర్వహణలో 54 వ వంశీ సీల్ వెల్ ఉగాది సందర్భంగా 65 మందికి గతించిన ప్రముఖుల స్మరణగా పురస్కార ప్రదాన మహాసభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఉగాది పేరు ఏదైనా మాంచి పనులుకు మాంచి జరుగుతుంది అని చెప్పారు అధ్యక్షత వహించిన ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణాచారి మాట్లాడుతూ ధర్మ ప్రవర్తన తో నడిచే వారికి ప్రాభవం ఉంటుంది కానీ పరాభవం ఉండదు అని చెప్పారు. వంశీ రామరాజు నివేదిక సమర్పించారు పురస్కారం అందుకున్న వారిలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయం వి.సి.సూర్య ధనుజయ, సినీ నటులు సంగీత మంజు భార్గవి మన తెలంగాణ సంపాదకుడు దేవులపల్లి అమర్, సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, పంచాంగం ప్రవచనకర్త బాచుపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, దర్శకుడు రేలంగి నరసింహారావు, దూరదర్శిని డైరెక్టర్ కామేశ్వరీ, వ్యాఖ్యత కృష్ణమోహన్,సంగీత కళాకళాకారులు అయ్యగారి శ్యాంసుందర్ దంపతులు, రచయిత్రి నాగ పద్మిని, సుధామ, వై 8 చానల్ చైర్మన్ యదు మోహన్ తదితరులు తో పాటు అమెరికా సింగపూర్ ఖతర్ సౌదీ అరేబియా ఒమాన్ యుఎఇ బెహరాన్ బ్రిటన్‌లో నివాసం ఉంటున్న పదహారు మంది తెలుగు ప్రముఖులు వున్నారు. ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్‌ను నటశిఖరం బిరుదుతో సత్కరించారు. దర్శకుడు రేలంగి నరసింహారావు నటుడు చంద్ర మోహన్ పురస్కారం అందుకున్నారు. సుంకరపల్లి శైలజ పర్యవేక్షణ లో ఉదయం వేగ్నేష వికలాంగ బాల బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి సుదామయి రాధిక వ్యాఖ్యానం చేశారు.

గుండె వ్యాధులపై అవగాహన సదస్సు

చిక్కడపల్లి, మార్చి 22 (ప్రభాతవార్త) : వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం గుండె సంబంధిత వ్యాధులపై ప్రత్యేక అవగాహన సదస్సు క్లబ్ అధ్యక్షుడు ఎస్.మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అపోలో హాస్పిటల్స్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వాల్వులర్ హార్ట్ డిసీజ్ (గుండె కవాటాల వ్యాధి) అనే అంశంపై ప్రముఖ వైద్యులు డాక్టర్ రాహుల్ చౌదరి కొంగర ముఖ్య ప్రసంగం చేశారు. నేటి జీవనశైలిలో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత కీలకమని, కవాటాల సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని డాక్టర్ రాహుల్ వివరించారు. సదస్సులో పాల్గొన్న వాకర్లు తమ ఆరోగ్య సందేహాలను అడగ్గా, ఆయన వాటిని స్పష్టంగా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా, విజయవంతంగా సాగిందని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ శైలజా మోహన్, క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.మనోహర్‌రెడ్డి పర్యవేక్షించగా.. సెక్రటరీ దశరథ్, ట్రెజరర్ రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ కళ్యాణ్‌నాయక్, జాలీ వాకర్ కృష్ణ, మాజీ అధ్యక్షులు పి.వి. నిరంజన్‌రెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్, హౌస్ పెట్ డైరెక్టర్ కిషన్‌రావు, డాక్టర్ సునీల్‌కుమార్, నరసింహ పాల్గొన్నారు.

వట్టెపల్లిలో హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి

10 మందిని అదుపులోకీ తీసుకున్న పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 22 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టెపల్లిలో నివాస ప్రాంతాల మధ్య అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి చేశారు.ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం...వట్టెపల్లి ప్రాంతంలో మహ్మద్ తన్వీర్ (23) గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా హుక్కా సెంటర్‌ను నడుపుతున్నాడు.సమాచారం అందుకున్న పోలీసులు దాడి జరిపి పది మందిని అదుపులోకీ తీసుకున్నారు. పెద్ద సైజు మూడు హుక్కా ప్యాకెట్లు,చిన్న సైజు హుక్కా ప్యాకెట్లు తొమ్మిది,ఆఫిల్ ఫ్లైవర్ ఒకటి,అల్పోజ్ ఫ్లేవర్ బాక్సు ఒకటి,రెండు బాక్సుల బొగ్గులు,పన్నెండు హుక్కా పైపులు,స్మార్ట్ మొబైల్ ఫోన్ ఒకటి స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండ హుక్కా సెంటర్లు నడపటం చట్టా రీత్యా నేరమని,కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్వారి గుంతలో పడి మైనర్ బాలుడు మృతి

అడ్డగుట్ట, మార్చి 22 ప్రభాతవార్త : తిరుమలగిరి పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. క్వారి గుంతలో పడి ఓ మైనర్ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ముగ్గురు మిత్రులు స్నేహితురాలితో కలిసి సరదాగా బయటకు వెళ్లారు. మొదట ఓ రెస్టారెంట్‌లో స్నాక్స్ తీసుకున్న అనంతరం, కోహిమం దర్గాకు వెళ్లారు. అక్కడ కాలుకడుక్కుంటున్న సమయంలో రిత్విక్ రెడ్డి అనే మైనర్ బాలుడు అకస్మాత్తుగా కాలు జారి గుట్టపై నుంచి జారిపడి సమీపంలోని క్వారి గుంతలో పడిపోయాడు.అతడిని వెంటనే కాపాడేందుకు స్నేహితులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. స్థానికులు అక్కడికి చేరుకునే సరికి రిత్విక్ రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.సమాచారం అందుకున్న తిరుమలగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

కనుల పండువగా కల్యాణ మహోత్సవాలు

- 27న సీతారాముల కల్యాణం
- 28న స్వామివార్ల రథోత్సవం

ఆలయంలో కొలువైన శ్రీసీతారామలక్ష్మణులు

చాంద్రాయణగుట్ట, మార్చి 22, ప్రభాతవార్త : పాతబస్తీ కేశవగిరి రామాలయం దేవస్థానం కమిటీ, శ్రీషిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో 61వ వార్షిక శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలు, శ్రీరామ నవమి వసంత నవ రాత్రోత్సవాలు, శ్రీసాయిబాబా 26వ వార్షిక మహోత్సవాలు నాలుగు రోజులుగా కనుల పండువగా జరుగుతున్నాయి. పరాభవనామ యుగాది పర్వదినం రోజున ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 29వ ఆదివారం వరకు జరుగుతాయి. ఆలయ అర్చక స్వాములు పరాంకుశం సుధీర్ కుమారాచార్యులచే ఆదివారం ఉదయం సహస్రనామ పుష్పార్చన, సాయంత్రం విష్ణుసహస్ర నామ పారాయణం, మూల మంత్ర హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. సమీప బస్తీల భక్తులు హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కాగా చైత్రశుద్ధ పంచమి 23వ తేదీ సోమవారం స్వామి వారి ప్రతిష్ఠాపన రోజు ఉదయం పంచామృతాభిషేకం, అలంకరణ, మండపారాధన, వాస్తు హోమం, పంచసూక్త హవనం, సర్వతో భద్రమండప హవనం, ప్రాయశ్చిత హోమం, జయాధి హోమం, మహా పూర్ణాహుతి, బలి ప్రదానం, సాయంత్రం విష్ణు సహస్ర పారాయణం, 26వ తేదీ గురువారం ఉదయం సామూహిక సత్య నారాయణ వ్రతం, సాయంత్రం ఏడు గంటలకు ఎదుర్కోళ్లు, 27వ తేదీ శుక్రవారం, చైత్రశుద్ధ నవమి రోజు ఉదయం స్వామి వారికి అభిషేకం, అలంకరణ, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం, అనంతరం అన్నప్రసాద వితరణ, సాయంత్రం సాయిబాబా జన్మదిన మహోత్సవాలు, సంధ్యాహారతి, ముద్ర మంజరి ఆర్ట్స్ అకాడమిచే కళాబృందం నృత్య ప్రదర్శన, 28వ తేదీ శనివారం ఉదయం విశేష పూజలు, సాయంత్రం 7గంటలకు రథోత్సవం, 29వ తేదీ ఆదివారం ఉదయం గంగాజల అభిషేకం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని, మహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆ కోదండ రాముని అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సినీ గేయకవి డాక్టర్ సుద్దాల అశోక్

సాహిత్యం సమాజానికి దిక్సూచి

జాతీయ సినీ గేయకవి డాక్టర్ సుద్దాల అశోక్

చిక్కడపల్లి, మార్చి 22 (ప్రభాతవార్త) : ప్రముఖ కవి, రచయిత, శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన ఖిలోకాలోకనంఖి వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, శ్రీత్యాగరాయ గానసభ ఉదయ సాహితి (తెలంగాణ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ సినీ గేయకవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోని వివిధ అంశాలను లోతుగా విశ్లేషిస్తూ ఆచార్య వీరారెడ్డి ఈ వ్యాసాలను మలిచారని, ఇవి పాఠకులకు ఆలోచనలను రేకెత్తిస్తాయని కొనియాడారు. ఉదయ సాహితి రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ప్రముఖ విమర్శకులు శ్రీ దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప పుస్తకంలోని సాహిత్య విలువలను విశ్లేషించగా ప్రముఖ కవి, సినీ గేయకవి మోనశ్రీ మల్లిక్, స్థాపక కార్యదర్శి మద్దాలి రఘురామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రచయితను సత్కరించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కంటోన్మెంట్,మార్చి 22 ప్రభాతవార్త: మెరుగైన వైద్యం చాలా ఖరీదుగా మారిందిన పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన 47 మందికి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పేదలు కార్పొరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సనత్ నగర్ నియోజకవర్గం ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెచ్చినట్లైతే తక్షణమే పరష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు టీ.మహేశ్వరీ, ఈ కార్యక్రమంలో శేషుకుమారి, బిఆర్ఎస్ నేతలు కొలను బాల్‌రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్,నాగులు, వెంకటేషన్ రాజు,శ్రీహరి,అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ.శ్రీనగర్ కాలనీలో సిసి కెమెరాల ఏర్పాటు : ఎమ్మెల్యే

ఉప్పల్, మార్చి 22 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీనగర్ కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సిసి కెమెరాలతోపాటు, షటిల్ కోర్టును ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాలనీలలో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయడానికి సిసి టివి వ్యవస్థలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. నేరాల నియంత్రణలో కూడా సిసి కెమెరాల పాత్ర ఉంటుందన్నారు. అదే విధంగా యువత ఆరోగ్యవంతంగా ఉండేందుకు క్రీడా వసతులు అవసరమని, షటిల్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. .కాలనీ అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాల సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ అసోసియేషన్ నేతలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాలా వెంట బాక్స్ డ్రైన్ నిర్మాణానికి చర్యలు...

ఉప్పల్, మార్చి 22 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ మల్లికార్జున నగర్ కాలనీ మీదుగా నల్ల చెరువుకు వెళుతున్న మురుగునీటి కాలువ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు కాలనీవాసులు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. బోడుప్పల్ నుంచి నల్ల చెరువుకు వస్తున్న మురుగునీటి కాలువ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపై పారుతుందని కాలనీ సంఘం నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మురుగునీటి కాలువ వెంట బాక్స్ డ్రైన్ నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాచారం పారిశ్రామికవాడ నుంచి వస్తున్న రసాయన జలాలు దుర్వాసనతో రావడంపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. మురుగునీటి కాలువ వల్ల మూడు, నాలుగు కాలనీల ప్రజలు అవస్థలు పడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఆలయం అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు సత్తిరెడ్డి, రంగారెడ్డి, నగేష్, పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

మురుగుకాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

1 నుంచి మంగళ హారతులపై వర్క్‌షాప్

చిక్కడపల్లి మార్చి 22 (ప్రభాతవార్త): ఆధ్యాత్మికతను, సాంప్రదాయ కళలను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీసాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళ హారతుల వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్ (జూమ్ యాప్) ద్వారా ఈ తరగతులు జరుగుతాయని, వివిధ దేవతా మంగళ హారతులపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని అకాడమి వ్యవస్థాపకులు, ప్రముఖ సంగీత విద్వమసులు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి , వసుధ తెలిపారు. ప్రతి బుధవారం, గురువారం సాయంత్రం అయిదున్నర గంటల నుండి సాయంత్రం ఆరున్నర గంటల వరకు శిక్షణ ఉంటుందని, పదహారు ఏళ్ల పైబడిన వారు ఎవరైనా ఈ వర్క్‌షాప్‌లో చేరవచ్చని , బిగినర్స్‌కు సైతం సులభంగా అర్థమయ్యేలా స్టెప్‌బైస్టెప్ పద్ధతిలో 6 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున, ఆసక్తి గల వారు ఇతర వివరాల కోసం 8374927736 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

PUBLIC NOTICE

The General Public is here by informed that My Client **Sri. Akkera Vijay Kumar** S/o. A. Venkatesvarlu, Resident of 58, Karkhana Surya Nagar, VTC Secunderabad, The got the schedule of Property through a Registered Gift Deed No. 623/2005, Dated 15-04-2005, with the office of SRO, Bowenpally. The Link Document of the Schedule of Property i.e., Registered Sale Deed No. 101/1990, Dated 07-01-1990, with the office of SRO, Maredpally (R.O) Was lost, while he was travelling from His House, to Tirumalgiri. If anybody found/traced the above said original document to be returned to my client or at my office.

If any person/s, Financial Institutions, Banks having any right title, claim or objections in respect of below mentioned property may Contact the undersigned within Three (3) days from the date of publication of this notice with documentary evidence to substantiate their claim. After the expiry of Three Days period no claim or whatever shall be entertained.

SCHEDULE OF PROPERTY

All that the portion of the House premises bearing Plot No. 58, admeasuring 300.0 Sq.yards, or 250.8 Sq.Mtrs., in Survey No. 59/1/2, and having plinth area of 2122 Sft., having Ground and First Floor, situated at Suryanagar Colony, Kakaguda Village, Karkhana, Secunderabad. **Bounded by:- North:** 30' Road, **South:** Plot No. 57, **East:** 32' Road, **West:** Plot No. 59.

Sd/- CHANDRA SEKHAR SUNKU
ADVOCATE
H.No.83-191/136 (188/C),
VENGAL RAO NAGAR COLONY,
HYDERABAD - 500 038
PH No. 9247408839

మిట్టకంకల్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

పూడూరు మండల మిట్టకంకల్‌లో అంతర్గత సిసిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రావుల గోపాల్,మొర్రి బందయ్య తదితరులు

పూడూరు, మార్చి 22, ప్రభాతవార్త : అందరి సహకారంతో మిట్టకంకల్ గ్రామాన్ని అభివృద్ధి చేయిస్తామని సర్పంచ్ గోపాల్,ఉప సర్పంచ్ మొర్రి బందయ్య పేర్కొన్నారు.పూడూరు మండలం పరిధిలోని మిట్టకంకల్ గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ క్రింద మంజూరి అయిన రూ.5లక్షల నిధులతో ఆదివారం అంతర్గత సిసిరోడ్డు నిర్మానపు పనులను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అక్కడక్కడ మురుగునీరు ప్రవహిస్తున్నందున ఈ సమస్య పరిష్కారంకోసం తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రస్తుతంవేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ఆయా కాలనీల్లో నీటి సరఫరా అయ్యే పైపుల లీకేజీలకు మరమత్తులు చేసి సరిచేయడం జరిగిందన్నారు.గ్రామంలోని వీధుల్లో స్ట్రీట్‌లైట్లను అమర్చామని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యామ్,పంచాయతీ వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టర్ ఆఫీస్

యాచారం,మార్చి22, ప్రభాతవార్త: దేవాదాయ భూమికల రైతుల పరిరక్షణ కోసం చేపట్టే పాదయాత్ర విజయవంతం చేయాలని కౌలు రైతులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అంజయ్య పేర్కొన్నారు.యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం రైతులతో పైసా కార్మిక సంఘం నాయకులు అంజయ్య సమావేశమై మాట్లాడారు.. నజ్దిక్ సింగారం,తాటిపర్తి, కుర్మిద్ద, నందివనపర్తి 4 గ్రామాల రక్షి త కౌలు రైతుల1400 ఎకరాలు సాగు చేస్తున్న భూములకు 37/ఏ టెనెంట్ సర్టిఫికెట్ ఆధారంగా పట్టాలు చేయాలనీ డిమాండ్ చేశారు.కుర్మిద్ద రెవెన్యూ పరిధిలో మర్ల కుంట, మంగలి గడ్డ ,పోతు బండ తండలల్లో గిరిజన లకు సంబందించి 30 ఎకరాల భూమి ఫ్యూచర్ సిటీ రోడ్ కోసం రైతుల అనుమతి లేకుండా బలవంతపు భూసేకరణ నిలిపి వేయాలని డిమాండ్ చేస్తు 23 మార్చి ఇబ్రహీంపట్నం నుండి చలో కలెక్టర్ ఆఫీస్ పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు.

పేద కుటుంబాలకు వరంగా సిఎం సహాయ నిధి

కొత్తూర్, మార్చి 22, ప్రభాతవార్త: నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి వరం లాంటిదని గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా అన్నారు. ఆదివారం కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వడ్ల గోపాల్‌కు రూ.60 వేలు, మైలారం స్వరూపకు రూ.58వేలు, మల్కాపురం మల్లేష్‌కు రూ.30 వేలు, మీసాల అమృతకు రూ.20వేలు,చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దయానంద్ గుప్తా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకునే స్థోమత లేని పేదలకు సిఎం సహాయ నిధి గొప్ప ఆర్థిక అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్, గట్టు చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసారం రాజు, ఉపాధ్యక్షుడు మోడి శేఖర్, గట్టు బాలయ్య, గుండు కుమార్, మైలారం పెద్ద జంగయ్య, మధుసూదన్ రెడ్డి, మైలారం విశాల్, మల్లేష్, రాఘవేందర్ గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడి బడ్జెట్

-ఆరు గ్యారెంటీల అమలేది..?-మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్,మార్చి 22, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడిగా కనిపిస్తుందని,ఆరు గ్యారెంటీల అమలు మాత్రం శూన్యమని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఆయన కొడంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన రూ.3లక్షల కోట్ల బడ్జెట్‌లో అంకెల గారడి తప్ప అభివృద్ధి శూన్యమని తేల్చి చెప్పారు.బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రూ.2లక్షల కోట్ల బడ్జెట్‌తో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారని ప్రస్తుతం రూ.3లక్షల కోట్ల బడ్జెట్ ప్రజలకు అందకుండా మంత్రుల జేబులోకి వెలుతుందా అని ప్రశ్నించారు.ప్రజలను మభ్యపెట్టేందుకు చూపించిన బడ్జెట్ మాత్రమే అని ఎద్దేవా చేశారు.సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణ మాఫీ చేశామని గొప్పగా చెబుతున్నా,తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కనీసం 30శాతం కూడా రుణమాఫీ చేయలేకపోయారని ఆరోపించారు.కాంగ్రెస్ అంటేనే కుంభకోణాలు,స్కాంలతో కూడుకొన్న పార్టీ అని గత 65 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కుంభకోణాలను ప్రజలు గమ నిస్తునే ఉన్నారని తెలిపారు.ముఖ్యమంత్రి సోదరుడు అండతో బొంరాస్‌పేట్ మండలంలోని చెక్‌డ్యాంల నుంచి రూ.కోట్లలో ఇసుక వ్యాపారం కొనసాగుతుందని ఆరోపించారు.ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దామోదర్‌రెడ్డి,మధుసుదన్‌యాదవ్, విష్ణువర్దన్‌రెడ్డి, నవాజ్,కే. దయాకర్‌రెడ్డి, రఘు పతిరెడ్డి,మాజీ వెంకటయ్య,చిన్నయ్య,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

పదవిలో ఉన్నా... లేకున్నా అభివృద్దే నా ఎజెండా..

-దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా వెల్లడి

చేవెళ్ల, మార్చి 22, ప్రభాతవార్త: పదవిలో ఉన్నా..లేకున్నా.. దామరిగిద్ద గ్రామ అభివృద్దే నా ఎజెండాగా పనిచేస్తానని దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా అన్నారు.చేవెళ్ల మున్సిపల్ ఎన్నికల సమయంలో 9వ వార్డులో ప్రజలకు ఇచ్చిన హమి మేరకు దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా తన స్వంత నిధులతో వెస్తున్న సిసి రోడ్డు పనులకు ఆదివారం చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాముగౌడ్‌లతో కలిసి దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఇచ్చిన హమి మెరకు సిసి రోడ్డును తన స్వంత నిదులతో వెపించడం జరుగుతుందన్నారు.గతంలో పదవిలో ఉండి గ్రామ అభివృద్దికి అహర్నిశలు కృషి చేశానని, ప్రస్తుతం పదవిలేకున్నా.. గ్రామ అభివృద్దికై పాటు పడుతున్నానన్నారు.ప్రజలకు ఇచ్చిన హమిని నేరవెర్చుతామని, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ది చేసి చూపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాముగౌడ్, చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్,వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్‌లు బండారు శైలజ ఆగిరెడ్డి,మంగళి కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్,తాళ్ల పల్లి నర్సింలు, మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్తా, నాయకులు ఆగిరెడ్డి,దేవర వెంకట్‌రెడ్డి,ప్రభుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో సిసి రోడ్డు పనులకు శంఖుస్థాప చేసిన మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, దామరిగిద్ద మాజీ సర్పంచ్ మదుసూదన్‌గుప్తా,

పేదల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,ఎలుగంటి మధుసూదన్ రెడ్డిలు

షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త : పేద ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ ఫలాలు తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో ఆదివారం లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం, గ్రామంలో ఫార్మేషన్ రోడ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు గ్రామ సర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల నిజం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకంతో అర్హులందరికీ ఇల్లు కట్టించి ఇస్తుందని తెలిపారు. అలాగే మహిళా సంక్షేమం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, ఆసరా పెన్షన్ లు, రేషన్ కార్డులు ఇలా ప్రజలకు అవసరమయ్యే పథకాలను తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, రుద్రారం సర్పంచ్ యాదిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీశైలం, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు తలారి లక్ష్మమ్మ, వార్డు సభ్యులు రాఘవాచారి, గీత, యాదయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడీల కిష్టయ్య, గ్రామస్తులు రాజమల్లు, మహేందర్ చంద్రకళ, తదితరులు ఉన్నారు.

చందనవెల్లి లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

కేబుల్ వైర్ దొంగల హల్‌చల్

...60 బోరు మోటార్ల వైర్లను కత్తిరించిన దుండగులు

....ఆందోళన వ్యక్తంచేస్తున్న మంబాపూర్ గ్రామ రైతులు



స్టార్టర్‌కు ఉన్న కేబుల్ వైరును కత్తిరించిన దృశ్యం

బోరు మోటారు వద్ద కత్తిరించిన కేబుల్ వైర్

పెద్దేముల్,మార్చి 22, ప్రభాతవార్త: ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నలకు ఎదో ఓ రూపంలో కష్టాలు తప్పడంలేదు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఒనర్చి పండించిన పంట చేతికొచ్చె వరకు గ్యారంటి లేదు. అసలే వేసవికాలం ఏ చిన్న పొరపాటున నీరు సరఫరా కాకుంటే పంటలు ఎండె పరిస్తితి దాపురిస్తుంది. అటువంటి వేసవికాలంలో పొద్దు మాపు పోలాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతన్నలకు ఇబ్బందులు తప్పడంలేదు. అందుకు ఉదహరణగా పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో కేబుల్ వైర్ దొంగలు హల్ చల్ సృష్టించారు. శనివారం రాత్రి సుమారు 60 మంది రైతుల పొలాల వద్ద గల బోరుమోటార్ల కేబుల్ వైర్లను దుండగులు కత్తిరించుకొని ఉడాయించారు.రైతులు ఎప్పటి మాదిరిగానే ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లి చూడగా బోరు మోటార్లకు, స్టార్టర్లకు ఉన్న కనెక్షన్ వైర్లను కత్తిరించుకు పోవడంతో కంగుతిన్నారు. తన వద్ద కట్ చేసారంటు ఒకరు. తన వద్ద కట్ చేసారంటు మరోకరు ఇలా ఒకరికి ఒకరు చెప్పుకుంటే మొత్తము 60 మంది రైతుల బోరు మోటార్ల కేబుల్ వైర్లను దొంగిలించారు. అసలే వేసవి కాలం అందులో కేబుల్ వైర్లు కట్ చేయడంతో పంట పొలాలకు నీరు సరఫరా కాక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు దస్థప్ప, లింగప్ప, వెంకటయ్య, రాములు, నారాయణ, విష్ణు, నర్సిములు తదితరులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 60 మంది రైతుల పోలాల వద్ద ఒకే రాత్రి కేబుల్ వైర్లు దొంగిలించారంటే దొంగలు పెద్ద మొత్తంలో ఉన్నారా లేదా, బోరు మోటార్ల పనులలో అనుభవం ఉన్న వారా అని సందేహం కలుగుతోందని అంటున్నారు. కొత్త కేబుల్ వైర్‌ను కొనుగోలు చేయాలటే వ్యయ ప్రయాసాలతో కూడుకున్న విషయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాదిలో కూడా గుర్తు తెలియని వ్యక్తులు బోరుమోటార్ల దగ్గర కేబుల్‌వైర్లను దొంగిలించుకొని పోయారని గుర్తుచేశారు. రాత్రి వేళలో పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించి దొంగతనాలకు పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కేబుల్ వైర్లను దొంగిలించిన విషయాన్ని పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయనున్నట్లు రైతులు పేర్కొన్నారు.

పార్టీని బలోపేతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి

మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22, ప్రభాత వార్త: పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత జిల్లా, మండల, మున్సిపల్ నాయకత్వంపై ఉంటుందని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్ 8 లోని అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యా కేంద్రంలో ఘట్‌కేసర్ మండల బీజేపీ నాయకులకు, బూత్ అధ్యక్షులకు, ముఖ్య కార్యాకర్తలకు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం శనివారం సాయంత్రం 4 గంటల నుండి ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు ఒక రోజు పాటు నిర్వహించారు. ఆదివారం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి పార్టీని అన్ని విభాగాల్లో బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందని అన్నారు. గత 12 యేండ్లుగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పేద ప్రజల కొరకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టి విజయవంతంగా అమలు చేస్తుందని అన్నారు. కేంద్రం చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి పార్టీకి క్యాడర్‌తో పాటు ఓటర్ల మనస్సును గెలుచుకోవాలని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశ ప్రగతి అనేక రంగాల్లో ముందంజలో ఉందని అన్నారు. కేంద్రం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న తప్పులను ఎత్తిచూపి బీజేపీ వైపు మళ్లే విధంగా బూత్‌ల వారిగా పార్టీ క్యాడర్‌ను పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టి. వీరేందర్ గౌడ్‌తో పాటు పలువురు వక్తలు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, నానావత్ బిక్కునాథ్ నాయక్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గొంగళ్ల బాలేశ్ కురుమ, కొమ్మిడి శోభారాణి, చలువాది ప్రవీణ్‌రావు, ఘట్‌కేసర్ మండల బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహీపాల్‌రెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు బస్వారాజ్ గౌడ్‌లతో పాటు దాదాపు 200 మందికిపైగా పార్టీ క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యం కోసమే సిసి రోడ్డు!

దేవాలయం చైర్మన్ రాఘవేందర్ గౌడ్.

కొందుర్గు మార్చి 22 ప్రభాతవార్త : దేవాలయ దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యం కోసం సిమెంటు రోడ్ నిర్మిస్తున్నామని మండల పరిధిలోని వెంకిర్యాల గ్రామ శివారులోని సంజీవపురం వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ రాజ మోని రాఘవేందర్ గౌడ్ అన్నారు.ఆదివారం నాడు ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎన్. ఆర్.ఈ. జీఎస్. స్కీం లో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్ నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు,పరిసర గ్రామాల ప్రజలు, దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ లంకల రామకృష్ణారెడ్డి, సభ్యులు ఉషన్న,దాసరి నర్సింహులు, మోత్కూరి శేఖర్, గ్రామ ఉప సర్పంచ్ రమేష్ నాయక్ తోపాటు వివిధ గ్రామాల నాయకులు శివారెడ్డి, గోవిందు,సుందు రాములు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పాత హమీలకు పాతర... కొత్త హమీల జాతర

బడ్జెట్ అంత డోల

బిఆర్ఎస్ నేతలు మీడయా సమావేశంలో విమర్శలు

కుల్కచర్ల,మార్చి 22, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వంపెట్టిన బడ్జెట్‌లో సబ్బండ వర్గాల ప్రజలకు అన్యాయం చేసింద ఎన్నికలకు ముందు ఎన్నో హమీనిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆశాతో ఎదురుచూసిన అన్ని వర్గాకు అన్యాయం జరిగిందని

కుల్కచర్ల బిఆర్ఎస్ మాజి రైతు బంధు అంధ్యక్షులు రాజు, సినియర్ నాయకులు మహేశ్వరం రాములు గౌడ్ అన్నారు. అదివారం మండ కేంద్రంలోని మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..ప్రజలకు ఎన్నికోల్లో ఇచ్చిన హమీలునెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికాంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హమీలను నేరవేర్చలేదన్నారు. 6 గ్యారంటిలు 420 హమీలతో అధికారంలోకివచ్చిన ప్రభుత్వం ప్రజను నయవంచనకు గురిచేసిందన్నారు.కమీషన్ల కోసమే ఇందిరమ్మ ఇండ్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.ఈ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒక్క వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్ నూతనంగా మంజూరు చేసింది లేదని విమర్శించారు.

రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, సుస్థిరమైన పాలన అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సినియర్ నాయకులు మాలే కృష్ణయ్య గౌడ్, బోయిని మొగులయ్య, బృంగి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్

షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త : రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు, రైతు భరోసా నిధుల విడుదల ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ మండల అధికారి దండెం విజయచంద్ర, ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి వీక్షి ంచారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు బాగుపడినప్పుడే దేశం బాగుపడుతుందని, రైతు అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి అమలు చేస్తుందని తెలిపారు. నిరంతరాయంగా రైతు భరోసా అప్లికేషన్లను రైతుల నుండి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాబాద్ సర్పంచ్ అశోక్, అంతారం సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, హైతాబాదు సర్పంచ్ శాంతమ్మ యాదయ్య, బోడంపహాడ్ సర్పంచ్ కమలమ్మచెన్నయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, శేఖర్, ప్రభాకర్ రెడ్డి, జంగయ్య, ప్రశాంత్ రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారినీ మోనిక, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఎరువుల, పురుగుమందుల, విత్తన డీలర్లు, వ్యవసాయ సహకార సంఘాల స్టాఫ్, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు, ఉత్తమ రైతులు, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ రైతువేదికలో ప్రత్యేక ప్రసారాన్ని వీక్షిస్తున్న చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారులు

బడ్జెట్ లో 6 గ్యారంటీలకు నిధులేవీ

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

పరిగి, మార్చి 22, ప్రభాతవార్త : 6 గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ,అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడంతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు.ఆదివారం పరిగిలోని తన నివాసంలో పత్రికా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు..గడిచిన రెండున్నర సంవత్సరాల్లో 6 గ్యారెంటిలకు నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటని మహేష్ రెడ్డి అన్నారు మోసపూరిత పరిపాలన అందిస్తూ , అమాయకుల ఇండ్లను కూలుస్తూ, ప్రజల జీవితాలను,రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూనీ చేస్తుందని ఆరోపించారు.వచ్చే 2 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టి , కాంగ్రెస్ పార్టీకి తగ్గిన బుద్ధి చెప్తామని మహేష్ రెడ్డి తెలిపారు.

పోటో..రైటప్.

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో

అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు

-చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ వెల్లడి

చేవెళ్ల, మార్చి 22, ప్రభాతవార్త:చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో 18వ వార్డులో అర్హులైన నిరుపేద ప్రజలందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ వెల్లడించారు.ఆదివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులోని నాగని స్వప్ప రాములుకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజను చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ మాట్లాడుతూ మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను త్వరగా చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు.ఇంటి నిర్మాణం చేసిన లబ్దిదారులకు సకాలంలో బిల్లులను వెంటనే అందజేస్తామన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇందిమర్మ ఇల్లు మంజూరు వరంలాంటిదని, ప్రభుత్వం సహకారంతో ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలను చేసుకోవాలన్నారు. 18వ వార్డును అదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని, వార్డులోని సమస్యలను అధికారులతో కలిసి గుర్తిస్తున్నామని, సమస్యలను అంచలంచేలుగా పరిష్కరిస్తామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రేనేజీ, సిసి రోడ్లు అవసరమైన వసతులను కల్పించేందుకు నిరంతరం పాటుపడుతామన్నారు. 18వ వార్డులో ఏలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ మాజీ డైరెక్టర్ మంగళి యాదగిరి, కాలనీ వాసులు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రారంభించిన చేవెళ్ల మున్సిపల్ 18 వార్డు కౌన్సిలర్ మంగళి కళ్యాణీ

మహాభాగ్యం జ్యోతిర్లింగ దర్శనం

..ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందం సభ్యుడు హరిగౌడ్

పెద్దేముల్, మార్చి 22, ప్రభాతవార్త: జ్యోతిర్లంగ దర్శనం మహాభాగ్యమని తాండూరు హర్ట్ ఆఫ్ లివింగ్ బృందం సభ్యుడు హరిగౌడ్ అన్నారు. ఈ సందర్బంగా హరిగౌడ్ మాట్లాడుతూ ఈ నెల 24న మంగళవారం తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్‌లో 1000 సంవత్సరాల సోమనాథ్ జ్యోతిర్లింగాన్ని ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యము కల్పించనున్నట్లు తెలిపారు. జ్యోతిర్లింగ దర్శనానికి ముందు పూజ కార్యక్రమాలు, సత్సంగం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సోమనాథ్ జ్యోతిర్లింగాన్ని దర్శించుకొని పునీతులు కావాలని ఆయన కోరారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు ఆర్థిక సహాయం

శామీర్‌పేట, మార్చి 22, ప్రభాతవార్త: మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అనంతారం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయంను లక్ష్మాపూర్,మూడుచింతలపల్లి గ్రామాల మాజీ ఎంపిటిసి సభ్యులు పారుపల్లి నాగరాజు అందజేసినట్లు ఆ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అనంతారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటంతో పాటు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున సంఘం సభ్యులకు ఆయన ఆర్థిక సహాయంగా రూ.10వేలు అందజేశారు.



అనంతారంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేసిన సంఘ సభ్యుల దృశ్యం

మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని అనంతారం గ్రామం (1వవార్డులో) ఏప్రిల్ 5న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతున్నందున చేయూత నివ్వటానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని, సేవలు దేశానికే ఆదర్శమని నాగరాజు అన్నారు. దీనిలో మండల నాయకులు ఎం.నవీన్, సురేశ్, సంతోష్, కుమార్, మల్లేశ్, సురేశ్, పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఘట్‌కేసర్, మార్చి 22, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ డివిజన్ ఇడబ్ల్యుఎస్‌కాలనీలోని స్వామి వివేకానంద కమ్యూనిటీహాలులో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్వర్గీయ నుంచు రాహుల్‌యాదవ్ జ్ఞాపకార్థం మాజీ ఎంపిటిసి నుంచు హేమలత పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎవ్‌స్ రావునగర్ పేమ ఐ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన శిబిరంలో వైద్యులు, సిబ్బంది పలువురికి నేత్ర పరీక్షలు చేసి ఆపరేషన్లకు నిర్ధారించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందించేందుకు ఆర్డర్ చేశారు. ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ విచ్చేసి నేత్ర శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఉచిత శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బర్ల శశికళ, బేతాల నర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్ మంచాల అనిత శ్రీనివాస్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ఇడబ్ల్యుఎస్ కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, సామాజిక కార్యకర్తలు సార శ్రీనివాస్‌గౌడ్, శివరాత్రి సురేశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.